సమస్య తలెత్తితే..
క్షణాల్లో పరిష్కారం.!



- పూర్తయిన విద్యుత్ ఫీడర్ల సర్వే
- యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్న అధికారులు
- సర్వేతో ఎన్నో ప్రయోజనాలు
- వర్షాకాలం నేపథ్యంలో అధికారుల చర్యలు

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా టీజీఎయిమ్స్ యాప్‌ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే దానిని గుర్తించి పరిష్కరించేందుకు వీలు కలుగుతుంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే 99 శాతం ఫీడర్ల సర్వేను కూడా పూర్తి చేసింది. ఈ యాప్ ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు.


సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

బంజారాహిల్స్: ఎక్కడైనా, ఏదేని పరిస్థితుల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తితే నిమిషాల్లో సమస్యను గుర్తించి పరిష్కరించేలా టీజీఎయిమ్స్ యాప్‌ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో జూన్ 24వ తేదీ నుంచి 11 కేవీ ఫీడర్ల సర్వేను చేపట్టింది. 11 కేవీ ఫీడర్ల సర్వేను ఎప్పటికప్పుడు సంబంధిత డీఈలు, ఏడీఈలు, ఏఈలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పరిశీలిస్తున్నారు.ఈ సర్వేలో భాగంగా అధికారులు, సిబ్బంది సంబంధిత ఫీడర్ల పరిధిలో వివరాలు,ఫొటోలను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 99శాతం ఫీడర్ల పరిధిలో సర్వే పూర్తయ్యింది.ఈ సర్వే పూర్తయితే కరెంటు పోల్స్‌ను, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తే సాంకేతిక లోపాలను త్వరితగతిన గుర్తించేందుకు వీలవుతుంది. దీనికి సంబంధించి యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఖైరతాబాద్, సోమాజీగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ,ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, కృష్ణానగర్, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో 11కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే దాదాపుగా పూర్తి కావొచ్చింది. స్తంభాలు, డీటీఆర్‌ఏలు, ఆర్ఎంయూల వరకు ప్రతిదీ లెక్కించి జీపీఎస్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఈ సర్వేలో ఎస్ఈ నుంచి ఆర్టిజన్ వరకు అధికారులందరూ క్షేత్రస్థాయిలో పాల్గొని వివరాలు సేకరిస్తున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో 11కేవీ ఓవర్ హెడ్‌లైన్స్, ఎల్‌టీ లైన్స్ విస్తరించి ఉన్నాయి.అలాగే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటి పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు,లైన్లు,ఇన్సులేటర్లు, ఏబీ స్విచ్‌లు,కండక్టర్లు, డీటీఆర్‌ల వివరాలను పక్కాగా సేకరించి టీజీఎస్‌పీడీసీఎల్ జీఐఎస్ అసెట్ ఇన్‌స్పెక్షన్ మెయింటెనెన్స్ సిస్టంలో నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా సబ్‌స్టేషన్, ఫోల్ లొకేషన్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్ట్రక్చర్,రింగ్ మెయిన్ యూనిట్, ఆటో రీక్లోజ్,లైన్ ఏబీ స్విచ్‌ల జీఐఎస్ మ్యాపింగ్ చేయడంతో పాటు స్తంభాల పరిస్థితి (సిమెంట్, ఐరన్, రైల్వే‌ట్రాక్ పోల్) టీటీఆర్‌స్టక్చర్ ఎలా ఉంది, విద్యుత్ తీగల పరిస్థితి, పోల్స్ మధ్య గ్యాప్ వంటి విషయాలను ఈ యాప్‌లో పొందుపరుస్తున్నారు. తద్వారా భవిష్యత్తులో లైన్ల పునరుద్ధరణ పనులతో పాటు మెటీరియల్ సమకూర్చడం, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించడం, త్వరితగతిన ఘటనా స్థలాన్ని గుర్తించడం లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఏ సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్ని ఫీడర్లు..

సబ్‌స్టేషన్ పేరు	11కేవీ ఫీడర్లు	సర్వేపూర్తయినవి
అమీర్‌పేట	15	15
ఎస్‌కేనగర్	12	12
యూసుఫ్‌గూడ	16	15
బంజారాహిల్స్	43	41
ఫిలింనగర్	32	32
జూబ్లీహిల్స్	33	33
మాదాపూర్	39	33
మోతీనగర్	9	9
గ్రీన్‌ల్యాండ్స్	24	24
ఎస్ఆర్‌నగర్	22	22
బేగంపేట	30	30
బోరబండ	9	9
సనత్‌నగర్	17	17
ఎర్రగడ్డ	10	10

రైతు పక్షపాతి.. కాంగ్రెస్ పార్టీ


మంత్రి పొంగులేటిని సన్మానిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

నల్లకుంట: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రేవంత్ సర్కారు రైతు రుణాలు మాఫీ చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ సీనియర్ నాయకులు చింతల ధనార్జున్‌రెడ్డి, ఎడ్ల నరేందర్‌రెడ్డి, శరత్‌కుమార్ తదితరులు మంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని వారు పేర్కొన్నారు.

ఆగస్టు 15లోపు రూ.2లక్షల
రుణమాఫీ చేస్తాం : కట్టెల సుభాష్

నల్లకుంట: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ డబ్బులను వారి ఖాతాలో జమ చేయడంపై టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం నల్లకుంటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. గతంలో మన్‌మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ.60వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రైతులకు పంట రుణమాఫీ హామీ ఇచ్చారని గుర్తుకు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు ఆగస్టు 15వ తేదీలోగా మూడు విడతల్లో రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తుందని తెలిపారు.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం

నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని


సమావేశంలో మాట్లాడుతున్న వీజీఆర్ నారగోని, నేతలు

చిక్కడపల్లి: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమ నిర్మాణం చేపడుతున్నట్లు నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ (ఎన్‌పీజేఎఫ్) చైర్మన్ వీజీఆర్ నారగోని తెలిపారు. గురువారం అశోక్‌నగర్‌లో నారగోని అధ్యక్షతన వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు, ఫ్రంట్ ప్రతినిధులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రాజకీయ పార్టీల్లో ప్రభుత్వ పాలనలో, అసెంబ్లీలో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. జనాభాలో సగభాగానికి పైగా ఉన్నా బీసీల్లో రాజకీయ చైతన్యం లేని కారణంగా అగ్రకులాల ఆదిపత్యం పెరిగిపోతోందన్నారు. బీసీలను రాజకీయంగా చైతన్య వంతులను చేసే దిశగా నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ జిల్లాలో పెద్ద ఎత్తున బీసీ ప్రజలకు రాజకీయ అవగాహన కల్పించేందుకు యాత్రను చేపడుతున్నట్లు ఆయన ప్రకటించారు.

సీట్లు ఇవ్వకుంటే
ఓటు నిరాకరణ ఉద్యమమే..

◆ ప్రజాస్వామిక ఉద్యమంలో సీట్లు ఇవ్వని పార్టీలకు ఓట్లు వేయవద్దనే నినాదంతో ఓటు నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లోని ఏ ఒక్క అంశాన్ని కూడా అమలుచేయడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న రైతురుణ మాఫీతో అగ్రకులాలకు భూస్వాములకే లాభం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్ ఎం.నర్సయ్య, ఎ.లక్ష్మణ్, బోయ గోపీ, కే.బి.శ్రీధర్, పోడేటి పాల్, తుపాకుల సమత, ప్రభంజన్‌యాదవ్, డాక్టర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ సమావేశాలు


సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) జాతీయ సమావేశాలను ఆగస్టు 1, 2వ తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కన్వీనర్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో జాతీయ సమాఖ్య సమావేశాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఉద్యమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టులో జరిగే జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ ప్రధాన కార్యదర్శి నాగార్జున, మహిళా కన్వీనర్ మాస్ సావిత్రీ, నాయకులు జబ్బర్‌నాయక్, జన్ను రమేష్, కుమార్, గడ్డం శ్రీకాంత్, రాజు, విష్ణు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల వైద్యానికి ఎంతో భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద చెక్కులు మంజూరైన లబ్ధిదారులకు ఆయన పార్టీ కార్యాలయంలో అందజేశారు. 24 మందికి రూ.9.10 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానన్నారు.

హై టెన్షన్ విద్యుత్ తీగలను తొలగించాలి

తిలక్‌నగర్‌లో కరెంటు వైర్లపై కొమ్మలు పడటంతో షాట్ సర్క్యూట్

నల్లకుంట: దశాబ్దాల క్రితం తిలక్‌నగర్‌లో హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశారు. జనావాసాలను ఆనుకుని ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని స్థానికులు అధికారులతో మొరపెట్టుకున్నారు. అయినా అధకారుల నుంచి స్పందన రాలేదు. గురువారం తిలక్‌నగర్‌లోని ఓ ఇంటి ముందు ఉన్న బాదాం చెట్టు కొమ్మలు ఏపుగా పెరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. ఒక్కసారిగి షాట్ సర్క్యూట్ జరగడంతో స్థానికులు కార్పొరేటర్ అమృత, విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు విద్యుత్ తీగలపై పడుతున్న కొమ్మలను తొలగించారు. ఇప్పటికైనా హై టెన్షన్ విద్యుత్ తీగలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ హార్టికల్చర్ సిబ్బంది


కొమ్మతో పాటు తెగి పడిన విద్యుత్ తీగ

డ్రైనేజీ పైపులైన్ పనుల పరిశీలన


చెప్పల్‌బజార్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమా

కాచిగూడ: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా అన్నారు. గురువారం కాచిగూడ, చెప్పల్‌బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులను ఆమె పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, నర్సింహ, తపాల్, బాల ప్రసాద్, ముర్షద్, మల్లికార్జున్‌రావు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీఎల్-3గా జాసన్



చిక్కడపల్లి: అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ హైదరాబాద్ (ఏసీఎల్)-3గా బీ.జాసన్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే జరిగిన బదిలీల్లో బి.జాసన్ హైదరాబాద్ ఏసీఎల్-3కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కొత్త ఒరవడిని సృష్టించారని తెలిపారు. కార్మికుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పద్మశాలి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ (నాపా) ఆధ్వర్యంలో అఖిల భారత పద్మశాలి సంఘం సహకారంతో గ్రూప్-1, మెయిన్స్-24 పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పద్మశాలి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి తెలిపారు. విద్యార్థులు శిక్షణ తీసుకునేందుకు కావాల్సిన ఆర్థిక సహకారంతో పాటు మార్గదర్శకం చేస్తామన్నారు. నాపా వారి ఆధ్వర్యంలో పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేస్తానన్నారు. వాట్సాప్ నం: 86399 98711లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కొత్తబజార్ ప్రధానరోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి

కవాడిగూడ: డివిజన్ పరిధిలోని కొత్తబజార్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ నేత ఆకుల ప్రవీణ్ గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేశారు. గుంతల రోడ్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వ్యాపారం చేసుకోండి.. ఇబ్బందులు కలిగించకండి

రోడ్లను ఆక్రమించిన చిరువ్యాపారులపై కేసులు


రోడ్డుపైకి వచ్చి వ్యాపారం చేస్తున్న వారిని మందలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ యర్నానాయక్

కవాడిగూడ: ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఫుట్‌పాత్ వ్యాపారులపై చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గురువారం ఉదయం 11గంటలకు ట్రాఫిక్ పోలీసులు దౌర్జన్యంగా పండ్ల, భోజన వ్యాపారుల వస్తువులను తీసుకెళ్లారని చిరువ్యాపారులు వాపోయారు. కొన్నేళ్లుగా ఇక్కడ భోజనం అమ్ముతూ ఉపాధి పొందుతున్నానని మహిళ చిరువ్యాపారి తెలిపారు. ఫుడ్ లైసెన్స్, స్ట్రీట్ వెండర్ ఐడీ కార్డుతో పాటు విద్యుత్ అధికారులకు కరెంటు బిల్లు చెల్లిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఇటీవల సీఎం వచ్చినా తమకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదన్నారు. కానీ పోలీసులు తమపై జులూం చెలాయిస్తారని వాపోయారు.

– రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతుంటంతో వాహనదారుల నుంచి నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అందుకే గురువారం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించినట్లు పేర్కొన్నారు. వ్యాపారాలు చేసుకోవద్దని తాము చెప్పడం లేదన్నారు. రోడ్డుకు ఒకవైపు కొట్లు పెట్టుకొని వాహనదారులకు ఇబ్బంది కలిగించకుండా వ్యాపారం చేసుకోవాలన్నారు. రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ జామ్‌కు కారకులు కావొద్దని సూచించారు. అలా చేసే వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాదయాత్ర చేసి.. నేరుగా సమస్యలు తెలుసుకుని!


అరోరా కళాశాల వీధిలో చెత్తను తొలగించాలని సూచిస్తున్న కార్పొరేటర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని పలు ప్రాంతాల్లో గురువారం రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అరోరా కళాశాల వీధిలో పేరుకుపోయిన చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భరత్‌భూషణ్, నితిన్, శ్రీను, రాజేష్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఆదుకొని బతికించండి.!

ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న రోగి కుటుంబీకులు


చికిత్సపొందతున్న ఎల్లోరా సురేష్

చిక్కడపల్లి: తెలుగు శ్రోతలను తన గాన మాధుర్యంతో రెండున్నర దశాబ్దాలుగా అలరిస్తున్న సాయి పావని భర్త ఎల్లోరా సురేష్ గుండెపోటుతో కోమాలోకి వెళ్లారు. కొన్ని నెలలుగా ఖైరతాబాద్‌లోని వాసవీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు కుటుంబ సభ్యులే ఖర్చులు భరిస్తూ వచ్చారు. ఆయన పూర్తిగా కోలుకోవడానికి రూ.10లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మానవతా దృక్పథంతో దాతలు సహాయం చేయాలని గాయకురాలు సాయిపావని కోరుతున్నారు. దాతలు **ఫోన్ నంబర్: 94416 75680**లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి

కవాడిగూడ: అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ కోరారు. గురువారం కవాడిగూడ డివిజన్లు అన్నీ అంగన్‌వాడీ టీచర్లు, ఏసీటీసీ కళాశాల వద్ద నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి కార్పొరేటర్ రచనశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... మూడేళ్లు దాటిన పిల్లలను స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. అదే విధంగా 5సంవత్సరాలు దాటిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, ధనమ్మ, కవిత, శారద, చిన్నారులు, వారి తల్లిదండ్రులు, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శులు ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశరాజు, యువమోర్చా అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, శివరాజ్, బొల్ల రమేష, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


బడిబాట కార్యక్రమం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు

20, 21వ తేదీల్లో ప్రపంచ కమ్మ మహాసభలు

23 దేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న ప్రముఖులు

పంజగుట్ట: కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కెజీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రపంచ కమ్మ మహాసభలు హైటెక్స్‌లోని హైదరాబాద్ ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు కెజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా సభలకు 23 దేశాలు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20వ తేదీన ప్రారంభోత్సవం చేస్తారని, అదేరోజు పెట్టుబడుల సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు దానికి ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. 21వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు నుంచి కమ్మ సామాజిక వర్గం నుంచి గెలిచిన 50 మంది ఎమ్మెల్యేలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక సెషన్, ముగింపు సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కానున్నట్లు తెలిపారు.

బీసీల కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడం

పంజగుట్ట: కొంతమంది ప్రైవేట్ వ్యక్తులతో కోర్టులో కేసులు వేయించి బీసీలకు అన్యాయం చేసే కుట్రలు ముఖ్యమంత్రి పన్నుతున్నారని బీసీలకు అన్యాయం జరిగితే ఎంతటి త్యాగానికైనా వెనుకాడమని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే 6 నెలల్లో సమగ్ర కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చారన్నారు. ఏడు నెలలు గడుస్తున్నా ఎలాంటి విధి విధానాలు రూపొందించకుండా సాధ్యా అసాధ్యాల గురించి జానారెడ్డి సలహా తీసుకోవాలని సూచించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జానారెడ్డి చరిత్ర మొత్తం బీసీలకు వ్యతిరేక చరిత్రనే అని ఆయన తప్పకుండా బీసీలకు అన్యాయమే చేస్తారనిన్నారు. వెంటనే ప్రొఫెసర్ సింహాద్రి, జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు లాంటి వారితో నిపుణుల కమిటీ వేసి కులగణన చేయాలని డిమాండ్ చేశారు.

సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికే కగార్ యుద్ధం

ప్రొఫెసర్ హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. హరగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాలో భాగంగానే ఛత్తీస్‌ఘడ్‌లో కగార్ యుద్ధం జరుగుతోందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల్లో ఉన్న సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికే ఆదివాసీలపై యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.

◆ ఈ సందర్భంగా ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యానికి మానవత్వం, మానవీయత ఉండదని ఎన్‌కౌంటర్ చేసిన శవాలను కూడా వారి కుటుంబాలకు అప్పగించని సందర్భాలు ఉన్నాయని అన్నారు. సమాజం మార్పు కోసం త్యాగాలు చేస్తున్న వారిని గుర్తించకపోవడం అమానుషం అన్నారు. నేడు దేశంలో కార్పొరేట్ శక్తుల సందప పెరిగిందని అంబానీ కోడుకు పెళ్లికి రూ.5వేల కోట్లు ఖర్చు చేశారంటే ప్రజల నుంచి ఎంత దోపిడీ చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు.

◆ పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు మాట్లాడుతూ.. ఛత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న మారణహోమం కారణంగా 170 మంది మృతి చెందారన్నారు. అణచివేతకు పరాకాష్టే కగార్ యుద్ధం అన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే ఈ సైనిక దాడి జరుగుతోందని విమర్శించారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విరసం కార్యదర్శి రివేరా తదితరులు పాల్గొని ప్రసంగించారు.